క్లుప్తంగా

బహిర్భూమికి వెళ్లి వ్యక్తి మృతి

బత్తలపల్లి: మండలంలోని అప్పరాచెరువు గ్రామానికి చెందిన ఆకులేటి పెద్దన్న (51) మంగళవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి మృతి చెందాడు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న ఆయన రాత్రి బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత సేపటికీ ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. గ్రామ శివారులో విగతజీవిగా పడి ఉండడంతో గుండె పోటుకు గురై మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు, కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. కాగా, మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దాడితోటలో పట్టపగలే భారీ చోరీ

తాడిమర్రి: మండంలోని దాడితోటలో బుధవారం ఉదయం ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రైతు బొజ్జె చిన్నసుబ్బారెడ్డి వ్యవసాయంతో పాటు ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలు బాడుగకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం తన చిన్న కుమారుడు విజయ్‌కుమార్‌రెడ్డితో కలసి పనిమీద అనంతపురం వెళ్లాడు. అతని భార్య రమణమ్మ 9 గంటలకు పనిపై పక్కింటికి వెళ్లింది. ఆ సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి ముందు ఉంచిన గడ్డపారతో తలుపులు బద్దలు కొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి పది తులాల బంగారు నగలు, రూ.3 లక్షల నగదు అపహరించుకెళ్లారు. అరగంట తర్వాత ఇంటికి చేరుకున్న రమణమ్మ అప్పటికే తలుపులు బద్దలై ఉండడం గమనించి ఆందోళనతో లోపలకు వెళ్లి పరిశీలించింది. బీరువాలోని బంగారు, నగదు కనిపించకపోవడంతో వెంటనే భర్తకు సమాచారం అందజేసింది. విషయం తెలుసుకున్న సీఐ కంబగిరి రాముడు, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి ఆగంతకుల వేలిముద్రలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేడు వైస్ ఎంపీపీ ఎన్నిక

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ ఉపాధ్యక్షురాలి ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగావతి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఎన్నికకు ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

తలుపుల: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా నోడల్ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ అన్నారు. మండలంలోని కుర్లి పంచాయతీలోని సిద్దుగూరిపల్లి గ్రామంలో వైద్యాధికారి మున్వర్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామాల్లో వైద్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలకు సూచనలు చేశారు. ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులురెడ్డి, రామమోహన్, బాబాజీ, రోజారాణి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- పథకాలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పీవీ సిద్దారెడ్డి



ధర్మవరం: 40వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి



తనకల్లు: ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

ధర్మవరం: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి నవరత్నాల్లోని సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల జీవితాలలో వెలుగులు నింపారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక 34వ వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వార్డులో ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు వార్డు ప్రజలు కాలనీలో వీధిలైట్ల కొరత ఉందని.. రాత్రివేళల్లో పాముల సంచారం కారణంగా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వార్డులో కొత్త వీధి లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మరికొంత మంది వార్డు ప్రజలు పలు చోట్ల సీసీరోడ్లు, డ్రైన్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ శివారు ప్రాంత కాలనీల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని ముందుగా డ్రైన్‌లు ఆ తర్వాత సీసీ రోడ్లు వేయించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ, కులం, మతం, ప్రాంతం అన్న తేడా లేకుండా పేద వారైతే చాలు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. రైతులు, చేనేతలు, మహిళలకు ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రాబోయే ఎన్నికల్లో అఖండ విజయం సాధించి మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని తెలిపారు. అందుకు ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వార్డులోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఇంటి పట్టాల మంజూరు, గృహ నిర్మాణ లబ్ధిదారుల సంఖ్య, ఆసరా, సామాజిక పింఛన్ల పంపిణీ తదితర పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు సేవా దృక్పథంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఎక్కడైన చిన్నపాటి అవినీతి ఆరోపణలు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్రగుంట భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ పెణుజూరు నాగరాజు, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వార్డు కౌన్సిలర్ బాలం ఓబుళమ్మ, వార్డు ఇన్‌చార్జ్ బాలం గోపాల్, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

తలుపుల: వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లక్కసముద్రం సచివాలయం పరిధిలోని గజ్జలప్పగారిపల్లి, లక్కసముద్రం, గొందిపల్లి, బాలిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎంపీపీ రఫీనాయక్, సర్పంచ్ తులశమ్మ, సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు, వృద్ధులు మాకు సంక్షేమ పథకాలన్నీ పారదర్శకంగా అందాయంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, పింఛన్లు మంజూరు చేయించాలని తదితర సమస్యలను విన్నవించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో ఫ్లోరింగ్ దెబ్బతినడంతో పిల్లలకు అసౌకర్యంగా ఉందని తెలిపారు. వెంటనే ఫ్లోరింగ్ వేయించాలని స్థానిక నాయకులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలన్నా, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా మరోసారి జగన్‌మోహన్ రెడ్డికి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. వందేళ్ల చరిత్రలో పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల వారికి న్యాయం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పురుషోత్తంరెడ్డి, పయాజ్ అహమ్మద్, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు (క్రిష్టారెడ్డి), సర్పంచ్‌లు వెంకటనారాయణ, శ్రీరామ్‌రెడ్డి, వెంకటపతి నాయుడు, షేక్షావలి, దివాన్‌వలి, పురుషోత్తంరెడ్డి, రవీంద్ర రెడ్డి, అంజి, శివశంకర, రామాంజినేయులు, సథారెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకొచ్చిన వలంటర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరయ్యారు. మొదటగా సీఎం జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడంలో వలంటీర్లే కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లు సీఎంగా పనిచేసినా చంద్రబాబు ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఎన్నికలు వస్తుండటంతో మరోసారి అబద్ధపు హామీలతో జనం ముందుకు వచ్చి మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. డబ్బు కోసం, స్వార్థం కోసం తప్ప చంద్రబాబు అధికారాన్ని దేని కోసం ఉపయోగించలేదన్నారు. అనంతరం సేవా రత్న, సేవామిత్ర అవార్డులు వచ్చిన వలంటీర్లకు ఘనంగా సన్మానించారు. ఈ నెల 14న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా తోపుదుర్తి మహిళా సహకార డెయిరీని ప్రారంభిస్తామన్నారు.

రైతులకు అండగా ఉంటాం

ఆత్మకూరు: 'నేనూ రైతు బిడ్డనే .. రైతులు పడే ఇబ్బందులు , అవస్థలు నాకు తెలుసు ఎంత కష్టం వచ్చినా రైతులకు అండగా నిలుస్తా' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పంపనూరులో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలసి తోపుదుర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత బోర్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నెలకు మండలంలో 100 బోర్లు వేయించాలని నాయకులకు సూచించారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా వందల సంఖ్యలో బోర్లు వేయించామన్నారు.

నెల రోజుల క్రితం వివాహం.. అప్పుడే విషాదం

- కడుపు నొప్పి తాళలేక భర్త ఆత్మహత్య
- జీర్ణించుకోలేక భార్య ఆత్మహత్యాయత్నం



మనోజ్‌కుమార్ (ఫైల్)

గుడిబండ: నెల రోజుల క్రితం పెళ్లి వేడుక జరిగిన ఇంట విషాదం నెలకొంది. కడుపు నొప్పి తాళలేక నవ వరుడు ఆత్మహత్య చేసుకోగా... భర్త మృతిని జీర్ణించుకోలేక నవ వధువూ ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం బీటీపల్లి నివాసి మనోజ్‌కుమార్ (24)కు నెల రోజుల క్రితం వీరజ్జనపల్లికి చెందిన శిల్పతో వివాహమైంది. నవ దంపతులు ఎంతో అన్యోన్యంగా జీవించేవారు. అయితే కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న మనోజ్‌కుమార్.. బుధవారం ఉదయం కడుపు నొప్పి తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన శిల్ప.. భర్త లేని జీవితం తనకూ వద్దంటూ అక్కడే ఉన్న క్రిమి సంహారక మందుతాగింది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుని తండ్రి హనుమంతరాయప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సౌజన్య కుమారి

ధర్మవరం రూరల్: గ్రామాలను శుభ్రంగా ఉంచి, ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంపీడీఓ సౌజన్య కుమారి అధికారులు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గిరకరమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా గ్రామాల్లో అపరిశుభ్రత ఏర్పడి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం వుందన్నారు. సర్పంచులు, అధికారులు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి రోగాలు దరిచేరకుండా చూడాలని ఆదేశించారు. ఇటీవల చింతలపల్లి, చిగిచెర్ల, ఉప్పునేసినపల్లి తదితర గ్రామాల్లో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయన్నారు. విద్యుత్ అంతరాయం కారణంగా తాగునీటికి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. త్వరలో ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం అందే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం పండ్ల తోటల రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. మామిడి, చినీ, సపోట, జామ తదితర పంటలను ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసుకునేందుకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిన్న కృష్టారెడ్డి, వైకేపీ ఏపీఓ రఘునాథరెడ్డి, సెరికల్చర్ అధికారి దామోదర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగానందరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో బాలిక మృతి




ఐశ్వర్య (ఫైల్)

కదిరి: స్థానిక వైఎస్సార్ నగర్‌లో బుధవారం విద్యుత్ తీగ తగిలి ఐశ్వర్య(12) మృతి చెందింది. సీఐ తమ్మిశెట్టి మధు తెలిపిన మేరకు... వైఎస్సార్ నగర్‌లో మురుగు కాలువపై తాత్కాలికంగా ఇల్లు నిర్మించుకున్న గంగరత్నమ్మ, కరుణాకర్ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఐశ్వర్య ఉన్నారు. లేపాక్షి గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బాలిక వేసవి సెలవులు కారణంగా ఇంటి వద్దే ఉంటోంది. తల్లి చుట్టుపక్కల ఇళ్లలో పాచి పనులు చేసుకుంటుండగా తండ్రి కూలి పనులకు వెళుతుంటాడు. ఐశ్వర్య ఇంటి పక్కనే ఉన్న బంధువులు ఇంటికి పై కప్పు బదులు ప్లాస్టిక్ పట్ట వేసుకున్నారు. అది కాస్త గాలికి పక్కకు జరగడంతో వారి కోరిక మేరకు ఐశ్వర్య ఆ ప్లాస్టిక్ పట్టను సరి చేస్తుండగా ఇంటి గోడపైగా వెళుతున్న 33 కేవీ విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విషపూరిత ద్రావకం తాగి వివాహిత మృతి

ముదిగుబ్బ: మండలంలోని నల్లచెర్లోపల్లి గ్రామానికి చెందిన భారతి (33) బుధవారం విషపూరిత ద్రావకం తాగి ఆత్మహత్య చేసుకుంది. కొన్నేళ్ల క్రితం కడప జిల్లా రైల్వే కొండాపురం నుంచి వచ్చి స్థిరపడిన భారతికి అనంతపురం నగరానికి చెందిన రమణతో వివాహమైంది. సంతానం కలుగలేదని మనస్తాపంతో పుట్టింటికి వచ్చిన ఆమె బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యాయత్నం చేసింది. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే అనంతపురం తరలించారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది.

కార్యకర్తలకు అండగా ఉంటాం



సాయిరాంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చెర్లోపల్లి గ్రామానికి చెందిన వేమన్న, సాయిరాం ఇటీవల గాయపడటంతో వారిని పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకుని ఓదార్చారు. వైస్ ఎంపీపీ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌కు కానిస్టేబుల్

హిందూపురం: స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సురేష్‌బాబును వీఆర్‌కు పంపుతూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ సురేష్‌బాబుపై భార్య శిరీషా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో సురేష్‌బాబు అక్కడే విధుల్లో ఉంటే కేసును పక్కదారి పట్టించే అవకాశం ఉండడంతో అతన్ని వీఆర్‌కు పంపినట్లుగా తెలిసింది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ముదిగుబ్బ: మండలంలోని టీఎన్ పాళ్యం అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 19 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ కంబగిరి రాముడు, ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. బుధవారం ఉదయం అందిన సమాచారం మేరకు అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టగా పేకాట ఆడుతూ నిందితులు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.1,20,350 నగదు స్వాధీనం చేసుకుని, రెండు జీపులు, ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు వివరించారు.

ఏడు సెల్‌ఫోన్లు, రూ.49 వేలు చోరీ

ఓడీ చెరువు: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సంతలో ఏడు సెల్‌ఫోన్లు, రూ.49 వేలను దుండగుడు అపహరించుకెళ్లాడు. బాధితులు తెలిపిన మేరకు.. వారపు సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌బీఐ పాయింట్‌లో పని చేస్తున్న శీను ప్యాంటు జేబులో ఉంచుకున్న రూ. 49 వేలు నగదు దొంగలించి దొంగ పరుగు తీశాడు. గమనించిన శీను ఆ దుండగుడిని పట్టుకునేందుకు ప్రయత్నించినప్పుడు సెల్‌ఫోన్‌ను శీనుపైకి విసిరి తప్పించుకెళ్లాడు. అంతలో పలువురు తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఎస్‌ఐ గోపి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి బలవన్మరణం



గౌతమి

పరిగి: సప్లిమెంటరీ పరీక్షల్లోనూ ఫెయిల్ అవుతాననే భయంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పరిగి మండలం కొడిగెనహళ్లి ఎస్సీ కాలనీకి చెందిన జయమ్మ కుమార్తె గౌతమి (15) ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మేథమేటిక్స్ సబ్జెక్‌లో ఫెయిల్ అయింది. దీంతో మంగళవారం సప్లిమెంటరీ పరీక్ష రాసి సాయంత్రం ఇంటికి చేరుకుంది. అప్పటికే ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తల్లి చీరతో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాలువపల్లి వద్ద ఆకుకూరలు అమ్మడానికి వెళ్లిన తల్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తలుపు లోపల గొళ్లెం వేసినట్లు గమనించి కుమార్తెను పిలిచింది. ఎంతసేపటికీ తలుపు తీయకపోవడంతో కిటికిలో నుంచి లోపలకు చూడగా అప్పటికే ఉరికి వేలాడుతున్న కుమార్తె మృతదేహం కనిపించింది. దీంతో గట్టిగా కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో వారు అక్కడకు చేరుకుని తలుపులు బద్ధలుగొట్టి లోపలకు వెళ్లి గౌతమిని కిందకు దించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్య చేసుకునే ముందు గౌతమి రాసి పెట్టిన మరణ వాఙ్మూలాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో 'తన చావుకు ఎవరూ కారణం కాదని, పరీక్షల్లో మళ్లీ ఫెయిలవుతానేమోననే భయంతో తన తల్లి బాధపడకూడదంటూ ఆత్మహత్య చేసుకుంటున్నా' అని పేర్కొంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

నల్లచెరువు: మండల పరిధిలోని ఉప్పార్లపల్లికి చెందిన మహబూబ్ బాషా, రామాంజి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస్‌రెడ్డి చికిత్సల నిమిత్తం ఇద్దరికి రూ.5 వేల చొప్పున రూ.10 వేల ఆర్థికసాయాన్ని బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో అందజేశారు. బావాఖాన్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసులు, పూల ప్రకాష్ రెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

పోషకాహారం పక్కాగా అందజేయండి

పుట్టపర్తి అర్బన్: ప్రశాంతిగ్రామంలోని ప్రాజెక్టు కార్యాలయంలో జిల్లాలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో నూతనంగా మంజూరైన 95 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులను విద్యాశాఖ, సచివాలయ ఉద్యోగులను సమన్వయం చేసుకుని పూర్తి చేయించాలన్నారు. ఒక్కో భవనం రూ.15 లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో నాడు-నేడు కింద మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంపిక

ధర్మవరం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

బాలలతో పని చేయిస్తే చర్యలు

కదిరి అర్బన్: ఏపీ సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలో చైల్డ్ లేబర్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని షాపింగ్ మాల్స్, కిరాణాదుకాణాలు, వెల్డింగ్‌షాప్స్ తదితర ప్రదేశాల్లో పని చేస్తున్న ముగ్గురు బాలకార్మికులను గుర్తించారు. వీరిని సమీప పాఠశాలలో చేర్పిస్తామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జహీరుద్దీన్, జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ అబ్దుల్ మాలిక్ తెలిపారు. బాలకార్మికులతో ఎవరైనా పని చేయిస్తే చట్టరీత్యా నేరమన్నారు. దిశా జమేదార్ రామకృష్ణ, కానిస్టేబుల్ గౌసియా పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అమడగూరు: మలకవారిపల్లి ఎగువతండా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని (48 టెట్రా ప్యాకెట్లు, 48 టిన్‌బీర్లు) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. రవినాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తనకల్లు: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఈతోడు క్రాస్ వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు. తనకల్లు మండలం ఎగువ బత్తినవారిపల్లికి చెందిన మధు, అమడగూరు మండలం గోపాల్‌నాయక్ తండాకు చెందిన సాయినాయక్, భుక్యా భరత్‌నాయక్‌ను అరెస్ట్ చేశారు.

ఖాద్రీశుడి సేవలో కర్ణాటక మంత్రి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని కర్ణాటక మంత్రి మునియప్ప బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి సన్మానించారు. అనంతరం మంత్రికి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు.



నేడు బత్తలపల్లి ఎంపీపీ ఎన్నిక


బగ్గిరి త్రివేణి

బత్తలపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాయలంలో గురువారం బత్తలపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎంపీపీ ఎన్నికలను నిర్వహించేందుకు శ్రీసత్యసాయి జిల్లా సర్వే డిపార్ట్‌మెంట్ డీఎస్ఓ రామకృష్ణను ప్రత్యేకాధికారిగా మండలానికి ప్రభుత్వం నియమించిందన్నారు.

ఎంపీపీగా బగ్గిరి త్రివేణి!

బత్తలపల్లి ఎంపీపీగా అప్పరాచెరువు ఎంపీటీసీ సభ్యురాలు బగ్గిరి త్రివేణి ఎన్నిక లాంఛనప్రాయమే. అభిమానులు, కార్యకర్తలు కూడలిలో భారీగా శుభాకాంక్షలు తెలుపుతూ స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

నల్లచెరువు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని అల్లుగుండు గ్రామంలోని పాలకమ్మచెరువు, రాగన్నగారి పల్లిలోని కోమిటి వాని చెరువు, ఓరువాయి గ్రామం చెరువువాండ్లపల్లిలోని నాయని చెరువు వద్ద జరుగుతున్న అమృత్ సరోవర్ చెరువు పూడికతీత పనులను బుధవారం పంచాయతీ రాజ్ డీఈ మధుసూధన్, సిరికల్చర్ ఏడీ శైలజ, సోషల్ ఆడిట్ డీఆర్పీ కిష్టప్ప పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, సర్పంచ్ పంచరత్నమ్మ, ఏపీఓ మంజుల, ఈసీ బాలు నాయక్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి, ఏపీడీ అసిస్టెంట్లు రవిచంద్రారెడ్డి, రామాంజి, రవికుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు హిమకర్, గంగాధర పాల్గొన్నారు.

వాహనాల వేలం

పుట్టపర్తి టౌన్: రికార్డులు సక్రమంగా లేని కారణంతో సీజ్ చేసిన 11 వాహనాలను డీటీవో ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణంలో వేలం నిర్వహించారు. వాహనాల వేలం ద్వారా రూ.2,36,400 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.





